VICTORY

విక్టరీ

# శ్రీ మత్స్య మహాపురాణం

(వచనం)



## శ్రీ వేదవ్యాస మహర్షి కృతము

# శ్రీ మత్స్య మహాపురాణము

(వచనం)

## వేదవ్యాస మహర్షికృతం


అనుసరణ

**ఆవంచ సత్యనారయణ**



వెల : రూ. **400/-**

**విక్టరీ పబ్లిషర్స్**

డోర్. నెం. 30-17-3ఎ, వారణాశివారి వీధి, సీతారాంపురం,
విజయవాడ- 520 002. ఫోన్ : 0866 - 2444156.

# పురాణ పరిచయం

**జయతిపరాశరసూనుః సత్యవతీ హృదయానందనో వ్యాసః**
**యస్యాస్య కమలకోశే వాఙ్మయ మమృతం జగత్ పిబతి**

*(వాయుపురాణం : 1-2)*

సత్యవతీ హృదయానందకరుడు, పరాశర మహాముని కుమారుడు, తన ముఖమనే కమలంలో సమస్త వాఙ్మయామృతాన్ని దాచుకొని ప్రపంచం చేత త్రాగిస్తున్నవాడు అయిన వ్యాసునికి నమస్కారము అని ఎవనిచేత రచింపబడిందో ఆవాయు పురాణం ఆ మహానుభావునికి నతమస్తకం అవుతుండగా

**అచతుర్వదనో బ్రహ్మో ద్విబాహు రపరోహరిః**
**అఫాలలోచనః శంభుర్భగవాన్ బాదరాయణః** *(మహాభారతం-ఆదిపర్వం)*

నాలుగు ముఖాలు లేని బ్రహ్మ, రెండు చేతులతో ఉన్న విష్ణువు, ఫాలభాగంలో కన్నులేని శివుడు బాదరాయణ వ్యాసుడని, తన జన్మకు కారణభూతుడైన కృష్ణ ద్వైపాయనునికి ప్రణతులర్పిస్తున్నది మహాభారతం.

అలాంటి వ్యాసమహాముని చేతిలో అష్టాదశ (18) పురాణాలు రూపు దాల్చాయని భారతీయుల విశ్వాసం. పురాణ శ్రవణం బహుకాలంగా ఈ దేశంలో సంప్రదాయమనే నదికి కాలువలు తీస్తున్నదే. అందుకే

**యథా పాపాని పూయంతే గంగావారి విగాహనాత్**
**తథా పురాణ శ్రవణాద్ దురితానాం వినాశనమ్**

*(వామనపురాణం - 95-86)*

గంగానదిలో స్నానం చేయటం చేత పాపాలు నశిస్తాయి. అలాగే పురాణ శ్రవణం చేత కష్టాలు దూరం అవుతాయి అని భారతీయుల నమ్మకం.

# పురాణాల ప్రాముఖ్యత

భారతీయ సంస్కృతికి అవిచ్ఛిన్నంగా కొన్నివేల సంవత్సరాల నుంచి మూలాధారాలుగా నిలుస్తున్నవి వేదాలు. ఎన్ని విదేశీ దండయాత్రలు జరిగినా, ఎన్ని సాంస్కృతిక దౌష్ట్యాలు చోటు చేసుకొన్నా మన సనాతన ఆర్షసంస్కృతి ఈనాటికీ నిలిచి ఉన్నది అంటే అందుకు కారణం వేదాలేనని చెప్పుకోవాలి. ఈ వేదాల యెడల మనకు గల భక్తి గౌరవాల కారణంగానే మనం ఐహిక సుఖాలనే కాకుండా ఆముష్మిక ఉన్నతికి మార్గాలు వేసుకోగలుగుతున్నాము. వేదాల ద్వారానే మనం జీవితంలో తప్పకుండా ఆచరించవలసిన కర్తవ్యాలను, విధులను తెలుసుకొని ఆచరించగలుగుతున్నాము. 'పుమాన్ పుమాంసం పరిపాతు విశ్వతః –అనే వేదమంత్రం ఒక మనిషి తన తోటిమనిషికి సహాయం చేసి దాని ద్వారా తన జన్మను సఫలం చేసుకోమని బోధిస్తున్నది. అలాగే "మిత్రస్యాహం చక్షుషా సర్వాణి భూతాని" అనే మంత్రం సమస్త ప్రాణులను మిత్రభావంతో చూడాలని నిర్దేశిస్తున్నది. 'కృణ్మో బ్రహ్మావో గృహే సంజ్ఞానాం పురుషేభ్యః' అనే మంత్రం – ఓ ప్రజలారా మనమందరం కలసి మానవులలో సద్భావం కొరకు, సద్భావనకోసం దైవాన్ని ప్రార్థిద్దామనే కర్తవ్యాన్ని బోధిస్తున్నది. ఇలా మానవుడు తన జన్మను సార్థకం చేసుకోవడానికి వేదాలు సన్మార్గాన్ని ఉపదేశిస్తున్నాయి, కర్తవ్యాన్ని ప్రబోధిస్తున్నాయి. వేదాలలో చెప్పబడిన అంశాలు చాలా వరకు నిగూఢంగా ఉంటాయి. సామాన్యునికి కూడా అర్థం అయ్యే విధంగా ఉపదేశం చేయడానికి పురాణాలు ఉద్భవించాయి. అందుకే ఋగ్యజుస్సామ అథర్వణ వేదాలనేవి నాలుగైతే, ఆ వేదాలతో సమానంగా 'పురాణం పంచమోవేదః' అని అయిదవ వేదంగా కీర్తించబడుతున్నది. భారతీయ సంస్కృతియొక్క స్వరూప స్వభావాలను సమగ్రంగా తెలుసుకోవాలంటే పురాణ అధ్యయనం చాలా ముఖ్యం. పురాణాలు భారతీయ సంస్కృతికి కొలదండాలవంటివి. ఆ పురాణాల మీద ఆధారపడే, ఆధునిక భారతీయ సమాజం తన నీతి నియమాలను నిర్దేశించుకొంటున్నది. పురాణాల్లో లేని విషయాలు ఏమీ లేవు. దేవతలు, ఋషుల వృత్తాంతాలు, సదాచారాలు, పదునాలుగు విద్యలు, మానవ కర్తవ్యాలు అన్నింటిని తనలో ఇముడ్చుకున్న ఈ పురాణ ప్రక్రియయే ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించు కొన్నది. అందుకే  పురాణాలను గురించి కొంతైనా తెలుసుకొనటం ప్రతి భారతీయునికి అవశ్యకర్తవ్యం. భారతీయఇతిహాస దృష్టితో చూస్తే పురాణాలకు మహత్తరమైన స్థానం ఉన్నది. ప్రతి హిందువుకు పురాణ అధ్యయనం ఏదో విధంగా అనివార్యం అవుతున్నది. అందుకే భారతీయులపై పురాణ సాహిత్యం నెరిపినంత గాఢ ప్రభావం మరి ఏ సాహిత్యం చూపలేకపోయింది.

## పురాణం అంటే ఏమిటి?

'పురాణ' శబ్దం యొక్క వ్యుత్పత్తి పాణిని అష్టాధ్యాయిలోను, యాస్కుని నిరుక్తంలోను, పురాణాలలో కూడా కనిపిస్తుంది. పాణిని చెప్పిన ప్రకారం 'పురాభవమ్' (ప్రాచీనకాలంలో జరిగినది) అనే అర్థంలో 'సాయంచిరం పాహ్ణే ప్రగే అవ్యయే భ్యష్టచ్యేట్చ్యు లౌతృట్చ' (4-3-23) అనే సూత్రం ద్వారా 'పురా' శబ్దానికి 'టుచ్య' ప్రత్యయంచేరి, తరువాత దానిపై 'తుట్ 'ఆగమంగా వచ్చినందువలన పురాతన శబ్దం ఏర్పడుతుంది. ఇంతేకాకుండా పాణిని రచించిన "పూర్వకాలైక సర్వజరత్పురాణనవకేవలాః సమానాధి కరణేన" (2-1-49), "పురాప్రోక్తేషు బ్రాహ్మణ కల్పేషు" (4-3-105)అనే ఇంకో రెండు సూత్రాలలో పురాణశబ్దాన్ని ఉపయోగించాడు. యాస్కుని నిరుక్తం ప్రకారం 'పురాణం' పురానవం భవతి (3-4-19) అనే ఇంకో రెండుసూత్రాలలో పురాణ శబ్దాన్ని నిర్వచించాడు. అంటే ప్రాచీనమైనదైనా క్రొత్తదిగా ఉండేదానిని 'పురాణం' అంటారని భావం. వాయు పురాణంలో 'పురాఅనతి' అని పురాణానికి వ్యుత్పత్తి చెప్పబడింది. అంటే ప్రాచీన కాలంలో జీవించి ఉన్నదానిని పురాణం అంటారు అని బ్రహ్మాండపురాణం (1-1-1-173) 'పురా ఏతద్ అభూత్' అంటే ప్రాచీన కాలంలో ఈ విధంగా జరిగింది అనే దానిని తెలియజేసే శాస్త్రమే పురాణం అని వివరిస్తున్నది. ఈ వ్యుత్పత్తులను పరిశీలిస్తే, పురాణం అనేది ప్రాచీన కాలానికి సంబంధించిందని తెలుస్తుంది. ఆర్యజాతి యొక్క వైదిక సాహిత్యానికి చెందిన జ్ఞానానికి, విజ్ఞానానికి అక్షయ నిధి పురాణం, ఇప్పటివరకు ప్రపంచంలో జ్ఞానులు, శాస్త్రవేత్తలు చెప్పిన విషయాలన్నీ పురాణాలలో ఉన్నాయని (కొందరి) భావన. మొత్తంమీద ప్రాచీన కాలంలో జరిగిన విషయాలను ఇప్పుడు జరుగుతున్నవానివలె ధర్మోపదేశకంగా తెలిపేవి పురాణాలు అని చెప్పవచ్చు.

## పురాణాల పాత్ర ఏమిటి ?

పురాణం అంటేనే ప్రాచీనమైనదని అర్థం. సృష్టికి ప్రారంభంలో జ్ఞానరాశి సామాన్య శబ్దాలలోను, వాక్యాలలోను, చెప్పటానికి వీలుకాని సమయంలో పురాణాలను దేవతలు సేకరించారు. ఆ ప్రాచీన కాలపు ఆలోచనాధార, భావనాధార, జ్ఞానధారలు విస్తారంగా పురాణాలను కూర్చటంలో ప్రతిఫలించింది. దీనివలన వేదార్థాన్ని సరియైన పద్ధతిలో, సరిగా అవగాహన చేసుకొనే వీలుకలిగింది. అదే 'పురాణ ఉపబృంహకత' అని పిలువబడింది. ఈ విధంగా భారతీయ సంస్కృతి సనాతన ధర్మాలలోని తులలేని రత్నాలు పురాణాలలో పొదగబడ్డాయి. వానిని సూక్ష్మంగా, తులనాత్మకంగా పరిశీలించి అవగాహన చేసుకొనకపోతే వేదార్థం సరియైన పద్ధతిలో అవగాహనకాదు. ఈ విశ్వంలో పరమాత్ముడు ఒకడే. అయితే ఆయా స్థలాలలో, ఆయా పురాణ ఖండాలలో వివిధ దేవ

తల ఉపాసనను తెలిపిన కథలలో దేవతలు, ఋషులు, తపస్వులు, మునులు, విప్రులు, పర్వతాలు, సముద్రాలు, తీర్థాలు, వృక్షాలు, పశుపక్ష్యాదులు – అన్నీ ఆ విషయాన్ని ప్రతి పాదించేవిగానే పురాణాల్లో చెప్పబడ్డాయి. అన్నీ కూడా పరమాత్ముని దివ్య చైతన్య స్ఫూర్తిని ఒకదానికి ఒకటి సహకారకంగా వివరించేవే. ఈ విధంగా సమగ్ర జీవన విధా నంలో సమగ్ర బ్రహ్మండ విషయాలలో, భావనలో ఒకే ఒక పరమాత్ముని సాక్షాత్కారం చేసుకొనే విధానాన్నే పురాణాలు ప్రతిపాదించాయి. అందుకు అవసరమైనంత సమర్థవంతంగా రూపుదిద్దుకున్నాయి. ఈ విషయాలనే పురాణ విద్య అన్నారు. అది మహర్షులకు సర్వ స్వంగా నిలిచింది. ఎన్ని రకాలైన దరిద్రాలకు భారతదేశం గురి అయినా, ఆ నిధే తర తరాలుగా ఈ దేశ సాంస్కృతిక వైభవాన్ని నిలబెట్టింది. ఇదే చరిత్రలో పురాణాలు నిర్వ హించిన పాత్ర.

## పురాణాలు - జయము అనే పేరు

**నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్**
**దేవీం సరస్వతీం వ్యాసంతతో జయ ముదీరయేత్**

అని మహాభారతము చెప్తుతున్నది. అందుచేత మహాభారతానికి జయము అనే పేరు ఉన్నట్లు తెలుస్తున్నది. 'జ' అంటే సంస్కృత సంఖ్యా పరిగణనాన్ని బట్టి 8. 'య' అంటే 1 అనగా 81.

'అంకానాం వామతో గతిః' అనే నుడిని బట్టి ఇది 18 అవుతుంది. 18 పర్వాలు గలది, 18 అధ్యాయాల భగవద్గీత కలది, 18 రోజుల కురుక్షేత్ర సంగ్రామం గలది, యుద్ధంలో పాల్గొన్న 18 అక్షౌహిణుల సైన్యం గలది, మహాభారతం – అందుకే ఆ మహాగ్రంథం 'జయం'.

అలాగే పురాణాలకు కూడా 'జయము' అనే పేరున్నది. అసలు పవిత్రమైన హిందూ గ్రంథాలకు 'జయము' అనే పేరు ఉన్నట్లున్నది. చూడండి.

**అష్టాదశ పురాణాని రామస్య చరిత్రం తథా**
**కార్ష్ణం వేదం పంచమం, యన్మహా భారతం విదుః**
**తథైవ విష్ణు ధర్మాశ్చ, శివధర్మాశ్చ శాశ్వతాః**
**జయేతి నామతేషాం, చ ప్రవదంతి మనీషిణః** – *భవిష్యత్పురాణం.*

అని అష్టాదశ పురాణాలకు, రామాయణానికి, మహాభారతానికి, విష్ణుపురాణం, శివధర్మ పురాణం, శారీరక సూత్ర భాష్యాలకు జయం అనే పేరు ఉన్నదని తెలుస్తున్నది.

**జయం జయత్యనేన సంసారమితి జయో గ్రంథః**

ధర్మార్థ కామమోక్ష ప్రతిపాదకమై సంసార జయమునకు అనగా ఈ లోకము నందు విజయము పొందుటకు సాధకములైన గ్రంథాలను జయము అంటారని తెలుస్తున్నది.

## పురాణాల ఆవిర్భావం

పురాణాలు ఎలా ఆవిర్భవించాయి అనే విషయాన్ని గురించి ప్రాచీన వాఙ్మయంలో అనేక విషయాలు చెప్పబడ్డాయి. పురాణాల ఆవిర్భావంలో రెండు ధారలు కన్పిస్తాయి. 1. వ్యాసునికి పూర్వపు సంప్రదాయం 2. వ్యాసోత్తర సంప్రదాయం. వ్యాసునికి ముందు 'పురాణం' అనే పదానికి లోకంలో బాగా ప్రచారంలో ఉండి, అవ్యవస్థితంగా ఇక్కడ అక్కడా చెల్లాచెదురుగా ఉన్న లోకవృత్తాత్మకమైన విద్య అని మాత్రమే అర్థం. దీనికి ప్రమాణంగా ప్రాచీన గ్రంథాలలో 'పురాణము' అని ఉన్నదేగానీ, పురాణ సంహిత అని లేక పోవడమే. అంటే దీనివలన ఏదీ గ్రంథంగా గాక విద్యావిశేషమనే దానిని భావించాలి.

పురాణాల తత్వాన్ని గురించి స్కాందపురాణంలోని రేవాఖండంలోను, పద్మ పురాణం (సృష్టిఖండం), మత్స్యపురాణంలోను 'కల్పాంతరంలో పురాణం ఒకటిగానే ఉండేదని, అది త్రివర్ణాలైన ధర్మ అర్థ కామాలకు సాధనంగా ఉండేదని, అది చాలా పెద్దగా శతకోటి శ్లోక విస్తారంగా ఉండేదని, ఆ పురాణం దేవలోకంలో ఉండేదని, కాలాంతరంలో క్షీణబుద్ధులైన మానవులు దానిని గ్రహించలేనందువలన, శ్రీమహావిష్ణువు మానవుల క్షేమం కోసం దానని నాలుగు లక్షల శ్లోకాలకు వ్యాసునిగా అవతరించి పరిమితం చేశాడని చెప్తున్నాయి. అందువలన మనుష్యలోకంలో పురాణాలు చతుర్లక్ష శ్లోకాలకు పరిమితం అయింది. ఆ చతుర్లక్ష శ్లోకాలనే 18 పురాణాలుగా వేదవ్యాసుడు చేశాడు. అవే ఈనాడు లభ్యం అవుతున్నాయని ఆ పురాణాలు ఘోషిస్తున్నాయి. కొందరు ఇది చతుర్లక్షాత్మకమైన ఒకే పురాణంగా ఉండేదని దానినే బ్రహ్మాండ పురాణమని పిలిచేవారని అదే 18 విభాగాలుగా చేయబడిందని తెలుపు తున్నారు. ఏదైనా ఈ 18 పురాణాలను వేదవ్యాసుడు రచించాడని ఈ యుగంలో భావించడం సరియైనదే.

## ఒకానొక కాలంలో ఒకటే పురాణం ఉండేదా ?

పురాణ వాఙ్మయం విస్తృతంగా పెరిగి నాలుగు లక్షల శ్లోకాల పరిమితికి చేరిన నేడు ఈ విషయాన్ని నిర్ధారించటానికి అంతగా అవకాశంలేదుగానీ పండితులు అనేకులు 'ఆరంభంలో పద్దెనిమిది కాదని తెలుపుతున్నారు. మొదట శ్లోకాత్మకమైన పురాణం ఒకటే ఉన్నట్లు అది క్రమంగా వేదోపబృంహణం చేయటం అనే అంశం ఆధారంగా క్రమంగా

పెరిగినట్లుగా, దాని గ్రంథసంఖ్య మొదట కొద్దిగా ఉండి తరువాత పెరుగుతూ పోయి, వేఱువేఱు కాలాలలో పెరిగిన కూర్పులు బయలు దేఱినట్లుగా చెప్పటానికి పురాణాలలోనే కొన్ని సూచనలు ఉన్నాయని తెలుపుతున్నారు.

జాక్సన్ అనే ఐరోపీయ పరిశోధకుడు “వైదికయుగం చివరి భాగం నుంచి క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం వరకు ఇతిహాసాలకు అనుబంధంగా పురాణం ఒకటి ఉండి నట్లుగా అందులో సర్గము, ప్రతి సర్గము, వంశము, వంశాను చరితము, మన్వంతరమ అనేవి వర్గీకరింపబడినట్లు హిందువుల వ్రాతలవలననే తెలియవస్తున్నది. స్టీఫెన్ కాలం వఱకు వేఱువేఱు మతాలలో వ్రాయబడుతూ వచ్చిన శాక్జన్ వృత్తాంతా (శాక్జన్ క్రానికల్)ల వంటివే ఈ పురాణాలు. నార్మనుల దండయాత్ర తరువాత పరస్పర సంబంధంలేని భాగాలు ఆ వృత్తాంతంలో చేరిపోతూ వచ్చినట్లే హిందూ సామ్రాజ్య కేంద్ర ప్రభుత్వం అంతరించిన పిదప పండిత సమావేశాలు అంతకుపూర్వం కంటే కష్టతరమైనా అప్పటి నుంచి ఆయా పుణ్యక్షేత్రాలలోని పండితులు తమ దగ్గరగల శ్లోకాత్మకమైన మూలపురాణ ప్రతులలో అక్కడక్కడా మార్చటం, కొన్నిచోట్ల స్థానిక విషయాలను చేర్చి గ్రంథాన్ని పెంచడం సంభవించి ఉండాలి. మూల గ్రంథమైన ఆది పురాణం నుంచి ఈ విధంగా బ్రహ్మపురాణం ఒరిస్సాలోను, పద్మపురాణం పుష్కర క్షేత్రంలోను, అగ్నిపురాణం గయలోను, వరాహపురాణం మధురలోను, వామన పురాణం స్థానేశ్వరంలోను, కూర్మపురాణం వారణాసిలోను, మత్స్యపురాణం నర్మదా ప్రాంతంలోను పుట్టాయి” అని వ్రాశాడు.

## మూలపురాణంలోని శ్లోకాలు ఎన్ని?

దేశకాలాలను బట్టి పురాణాలు చాలా మార్పులను పొందాయి. ఇప్పుడు స్పష్టంగా ఆ మూల పురాణ రూపాన్ని కనుక్కోలేకపోయినా కొన్ని ఆధారాలనుబట్టి ఒకపాటి నిర్ణయానికి రావచ్చు. భవిష్యత్పురాణంలోని “సర్వాణ్యేవ పురాణాని సంజ్ఞేయాని నరర్షభద్వాదశైవ సహస్రాణి ప్రోక్తానాం మనీషిభిః” అనే శ్లోకంవలన పురాణాలు అన్నీ కలిపి మొదట 12,000 శ్లోకాలకు పరిమితమేనని తెలుస్తున్నది. అలాగే ‘పునర్వృద్ధింగతా నీహ ఆఖ్యానైర్వివిధైర్నృప, యథాస్కాందంతథాభేదం భవిష్యం కురునందన” (ఓ రాజోత్తమా పురాణాలు అన్నీ కలిపి మొదట 12,000 గ్రంథంగా ఉండేది. కాల క్రమంలో అనేక వ్యాఖ్యానాలు చేరి అది వృద్ధి చెందింది అని చెప్తూ, ఇంకా స్కాందం శత సహస్రంతు లోకానాం జ్ఞాతమేవహి, భవిష్యమేతదృషిణా లక్షార్ధ సంఖ్యయాకృతం’ స్కాందం లక్షగ్రంథాల పరిమాణం భవిష్య పురాణం యాభైవేల గ్రంథంగా పెరిగిందని లోకులందరికీ తెలుసు అని తెలుపుతున్నది.

# మొదటలో ఉన్న ఆది పురాణం పేరు ఏమిటి?

ఒక్క పురాణం నుంచి పెక్కు పురాణాలు పుట్టాయనటానికి విష్ణుపురాణమే ఒక దృష్టాంతము. విష్ణు పురాణం పురాణాలకే ఆదర్శమైనదని, పురాణాలలో పురాతనమైనదని పరిశోధకుల భావన. కానీ ఈ విష్ణుపురాణం కూడా స్వతంత్రం కాదు, ఒకప్పుడిది బ్రహ్మాండపురాణం అనే సర్వసమగ్ర పురాణం యొక్క భాగంగా ఉండేది. తరువాత కాలంలో దాని నుంచి చీలి, స్వతంత్ర పురాణం అయింది. 16వ శతాబ్దంవాడైన వెన్నెల కంటి సూరన విష్ణుపురాణాన్ని తెలుగులోకి అనువదించాడు. అందులో షష్ఠ్యంతాలైన తరువాత "అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా యొనర్పంబూనిన బ్రహ్మాండపురాణంబు నందలి పరాశరసంహితయైన శ్రీవిష్ణుపురాణంబునకు కథాక్రమంబెట్టిదనిన' అని చెప్పాడు. ఇంతేకాక ప్రతి ఆశ్వాసం చివర గద్యలోను ఇలాగే వ్రాశాడు. దీనిని బట్టి 16వ శతాబ్దంలోని సంస్కృత విష్ణుపురాణ ప్రతిలో అది బ్రహ్మాండపురాణంలోని పరాశర సంహిత అనబడే భాగమని వ్రాసి ఉండాలని నిశ్చయంగా తెలుసుకొనవచ్చు. అయితే ఎందుకు ఈ విషయం ప్రస్తుత ముద్రిత సంస్కృత విష్ణు పురాణంలో చెప్పబడలేదంటే ఇది స్వతంత్ర పురాణం కాక ఒక మహాపురాణంలోని భాగం అంటే దాని గౌరవం తగ్గిపోతుందనే భయం వలన కావచ్చును. ఇటీవలివారు సంస్కృత లిఖిత ప్రతులు వ్రాసుకొనే సమయంలో ఈ మాటను ఎత్తివేసి ఉండవచ్చు. అయితే కొన్నింటిలో మాత్రం పరాశర సంహిత అని ఉన్నది.

అయితే 11వ శతాబ్దంనాటి ఆల్‌బెరూనీ అనే పండితుడు భారతదేశం వచ్చి మన గ్రంథాలను కొంత పరిశీలించటం జరిగింది. ఆయన ఇచ్చిన పురాణాల పట్టికలో విష్ణుపురాణం, బ్రహ్మాండ పురాణాలు వేర్వేరుగా పేర్కొనబడ్డాయి. అందువలన పదకొండవ శతాబ్దానికి ముందే బ్రహ్మాండపురాణం నుంచి విష్ణుపురాణం విడిపోయిందన్నమాట. భారతదేశంలో వైష్ణవమతం బాగా ప్రచారంలోకి వచ్చిన తరువాత విష్ణుపురాణం బ్రహ్మాండపురాణ భాగమని పేర్కొనడం ఆగిపోయి ఉండవచ్చు.

మొత్తంమీద మొదట బ్రహ్మాండమనే పురాణం ఒకటే ఉండేదని, అది అనేక సంహితలుగా ఉండేదని, విష్ణుపురాణం ఆ సంహితలలో ఒకటని చెప్పవచ్చు.

ఇక వాయుపురాణాన్ని పరిశీలించగా అందరు పండితులు వాయుపురాణాన్ని ప్రాచీన పురాణంగా అంగీకరిస్తున్నారు. ఇది హర్షచరిత్రంలోను, బాణుని కాదంబరిలోను పేర్కొనబడింది. ప్రస్తుతం బ్రహ్మాండపురాణంగా ముద్రితం అయిన గ్రంథంలో దాదాపు రెండువంతులు అంటే పరశురామ సర్గ వృత్తాంతము, లలితోపాఖ్యానం తప్ప మిగిలిన భాగం 78 అధ్యాయాలు, శ్లోకాలతో సహా మారకుండా వాయుపురాణంలో యథాశ్లోకంగా ఉన్నాయి. కాబట్టి వాయుపురాణం అసలు వాయుపురాణం కాదని గయాక్షేత్రమాహాత్మ్యం

కూడా కలిసి ఉన్న బ్రహ్మాండపురాణంలోని ఒక భాగమని భావించవచ్చు. అనగా బ్రహ్మాండపురాణంలోని వాయు సంహితను వాయు పురాణంగా పరివర్ధితం చేసి ఉండ వచ్చుని భావించటంలో ఎలాంటి అసంగతము ఉండదు. ఇందుకు బలంగా నారదపురాణంలోని ఒక కథలో దీనికి సూచన ఉన్నది. అందులో "నాలుగు పాదాలతోను బ్రహ్మాండపురాణాన్ని వర్ణించి ఉన్నాను. ఇది పదునెనిమిదవది, అనుపమానమైనది. సారాతీతమైనది. బ్రహ్మాండపురాణం నుండి పారాశర్యమహాముని దీనినే అందరికీ పదెనెనిమిది విధాలుగా చెప్పి ఉన్నాడు. ఆ మహాముని నావలన పురాణాలను విని, మననముచేసికొని ధర్మశీలురును, దీనానుగ్రహకరులైన మునులకు తెలియచెప్పి వానిని లోకమున వ్యాపింపచేసెను. (నారదపురాణం 100-29-35) అని చెప్పబడింది.

దీనినిబట్టి బ్రహ్మాండపురాణమే అన్ని పురాణాలకు మూలాధారమని ఒక పురాణ గాథ ఉన్నట్లు తెలుస్తున్నదిగదా. ఇంకొక ఆధారం మన భారతీయ హిందువులు క్రీ.శ. 5వ శతాబ్దానికంటే ముందే బలిద్వీపానికి వలస పోయారు. వెళ్లేటప్పుడు వారు తమతో తమ గ్రంథాలను కూడా కొన్నింటిని తీసుకొని వెళ్ళారు. అవి ఆ దేశ భాష అయిన 'కవి' భాషలోనికి అనువదించబడ్డాయి. ఆ గ్రంథాలలో సంస్కృతమూలాలతో సహా ఋగ్వ జుస్సామఅథర్వవేదాలు, రామాయణ మహాభారతములు కూడా ఉన్నాయి. పురాణాలలో ఆ బలిద్వీపవాసులు ఒక్క బ్రహ్మాండాన్నే గానీ, మిగిలిన వాటిపేర్లను కూడా ఎరగరు. అంటే మిగిలిన వాటి పేర్లను కూడా తెలియనంతగా ఉన్నారంటే ఆనాటికి ఒక్క పురాణమే ఉండేదని భావించవచ్చుగదా. పైగా బలిద్వీపంలో ఒకతెగ శైవులు ఉన్నారు. వారు బ్రహ్మాండపురాణన్నే తమ పురాణంగా అంగీకరిస్తారు. అందువలన హిందువులు వలస పోయినప్పుడు ఒకటే పురాణం ఉండేదని భావించవచ్చు. అలాగే నేటి బ్రహ్మ పురా ణంలో చాలా భాగాలు మక్కికి మక్కి విష్ణుపురాణంలోని భాగాలే భాగవతంలోని కథలు అన్నీ విష్ణుపురాణాన్ని అనుసరించి వ్రాయబడినవే. అలాగే అనేక పురాణాలలో ఉన్న శ్రాద్ధకల్ప విషయాలు దాదాపు ఏకరీతిగా ఉన్నాయి. అందువలన మొత్తంమీద క్రీస్తుశకం మూడు నాలుగు శతాబ్దాల వరకు పురాణం అనే పేరుతో ఒకే గ్రంథం ఉండేదని, దానికే అప్పుడుకానీ, అటుతరువాత కానీ బ్రహ్మాండపురాణం అనే పేరుండేదని దానిలో పన్నెండు వేల శ్లోకాలకంటే ఎక్కువగా ఉండేవి కావని, ఆ పురాణంలోని భాగాలు క్రమంగా దాని నుంచే వేరుపడి ప్రత్యేక పురాణాలు అయినాయని, ఈ విధంగా తటిగి పోవటం వలన మూల పురాణం క్రమంగా సన్నగిల్లి, కేవలం పేరుకు మాత్రం మిగిలిందని, మూల పురాణ భాగాలన్నింటిలోకి గొప్పవి, మొట్టమొదట చీలిపోయినవి విష్ణు వాయు పురాణాలు కావచ్చునని, కొంతకాలం వరకు ఏయే భాగాలు ఏయే మూల గ్రంథ భాగాలో తెలుప

బడుతూ ఉండేవని, కాని క్రమంగా మతము మీది అభిమానము ఎక్కువైన కొద్దీ గౌరవ భంగం అని తలచి కావచ్చు మూలగ్రంథపు పేరును జారవిడిచి స్వతంత్రాలైన ప్రత్యేక పురాణాలుగా వాటిని ప్రకటించడం మొదలైందని నిర్ణయించవచ్చు.

పురాణం లౌకిక శాస్త్రం. ఇది వేదం కంటే భిన్నమైనది. కానీ వేదానికి అనుకూల మైనట్టిది. ఇదే వేదోపబృంహణం. ఇది ఎప్పుడూ స్థిర రూపాన్ని కలిగి ఉండదు. ఇది కాలాన్ని అనుసరించి, పరివర్తన శీలకమైనట్టిది. కాల ప్రభావంచేత మార్పులను పొందుతుం టుంది. అందుకే తంత్రవార్తికమనే గ్రంథం వేదం అకృత్రిమమైనదని, పురాణం కృత్రిమ మైనదని చెప్తున్నది. అందుకే నిరుక్తం 'పురాపి నవం భవతి' పాతది అయినా కొత్తగానే ఉంటుంది అని చెప్పింది. అంటే కాలాంతరం ఉత్పన్నమయ్యే మార్పులను పురాణం తనలో లీనం చేసుకొంటుందని దీని భావం.

## వేదాలు పురాణాలను గురించి ఏమి అంటున్నాయి?

వైదిక కాలం నుంచి నేటివరకు వేదాలకు పురాణాలకు గల సంబంధం రక రకాలుగా వ్యక్తపరచబడింది. వేద పురాణాలు రెండూ ఒకరకంగా అవినాభావ సంబంధం గలవే, భారతీయతత్త్వం ప్రకారం వేదాలు అపౌరుషేయాలు అంటే మానవులు ఎవరూ వాటిని వ్రాయలేదు. భగవంతుడు వాటిని రచించలేదు. అవి నిత్యాలు, అనాదులు అని భారతీయుల విశ్వాసం. ప్రాచీనులు శబ్దాన్ని ధ్వనిని వేరువేరుగా భావించారు. వేద ధ్వని నిత్యం (వాచా విరూప నిత్యయా - ఋగ్వేదం-8-75-6) అంటే ఉచ్చరించటం చేతనే అది వినపడుతుందని, కానీ వేదశబ్దం నిత్యమని, ఉచ్చరించకపోయినా అది నిలిచే ఉంటుందని వారి విశ్వాసం. ప్రళయ కాలంలో వేదశబ్ద రాశి అంతా భగవంతునిలో నిక్షిప్తం చేయబడుతుంది. సృష్టి జరిగే సమయంలో పరమేశ్వరుని ద్వారానే వేదపురాణాలు వెలువడ్డాయి. వేదాలలోని గూఢమైన అర్థాలను తపస్సుద్వారానే అవగాహన చేసుకొనే వీలుంటుంది. వేదాలు ఈ నిగూఢమైన అర్థాలను గురించే భగవద్గీతలో భగవంతుడు 'వేదాంతకృద్వేద వివేద చాహమ్' (11-15) అని తెలిపాడు. ఈ విధంగా వేదాలలో నిక్షిప్తమైన గూఢార్థాలను గ్రహించటానికి సరళమైన భాష అవసరం. అందుకు పురాణాలు రామాయణ మహాభారతాలు రచింపబడ్డాయి. వేదాలు, పురాణాలు, రామాయణం, భారతం ఇవి అన్నీ కూడా ఒకే ఒక అఖండ ధర్మాన్ని ప్రతిపాదిస్తున్నాయి. ఈ విధంగా వేదాలలో భాగమైన ఉపనిషత్తులలోని నిగూఢతత్త్వం పురాణాలలో విపులంగా విశదంగా చెప్పబడింది.

నారదపురాణం, వేదాలకంటే పురాణాలకు ఉన్నత స్థానాన్ని కల్పిస్తున్నది. వేదాలు సమగ్రంగా పురాణాలలోనే ప్రతిష్ఠితాలుగా ఉన్నాయి అని ఇంకా ('న వేదే గ్రహ సంచారో

నశుద్ధిః కాలబోధినీ' - (నారద పురాణం - 2 - 24 - 19) అంటే వేదాలలో జ్యోతిష్యానికి సంబంధించిన గ్రహ సంచారం, ఇతర వ్యావహారిక విషయాలు ఎక్కడా లేవు అంటుంది. ఒక ఉదాహరణను చూద్దాం. పురాణాలలో చంద్రగ్రహణ సమయంలో రాహువు చంద్రుడిని కబళిస్తాడని పురాణాలు చెప్తున్నాయి. కానీ ఆధునిక విజ్ఞాన శాస్త్రం చంద్రుడు భూమి యొక్క నీడ (ఛాయ)లోనికి ప్రవేశిస్తాడని చెప్తుంది. కాబట్టి పురాణంలో చెప్పబడింది అభూత కల్పన అని భావించటం జరుగుతుంది. చంద్రుడు భూమి యొక్క ఛాయలోనికి ప్రవేశించినప్పుడు ఆ ఛాయలో ఒక చేతన శక్తి ఉంటుందనేది అందరికీ తెలిసిన సత్యమే - ఆ చేతన శక్తే పూర్ణచంద్రుడిని కనపడకుండా చేసి కొంత సమయం పాటు చంద్రుడి తేజం కానరాకుండా చేస్తుంది. అందువలన అది ఆసురీశక్తిగా భావింపబడుతుంది. దీనినే మనం రాహువు రాక్షస శక్తి అని అంటున్నాం. ప్రకృతిలో జరిగే అన్ని సంఘటనల లోను ఈ చేతన శక్తి యొక్క ప్రమేయం పైకి కనిపించకుండానే ఉంటుంది.

దేవీ భాగవతం 'శృతిస్మృతీ, ఉభేనేత్రం పురాణం హృదయం స్మృతమ్ ఏతత్త్రయోక్త ఏవ స్యాద్ధర్మోవా ఉ అన్యత్ర కుత్రచిత్' (11-1-21) అంటుంది. అనగా ధర్మ పురుషుడికి శృతులు, స్మృతులు రెండు కళ్ళైతే పురాణాలు హృదయం అవుతాయి. పురాణాలలో ఆరెం డింటిలో (శృతులు, స్మృతులలో) చెప్పిన ధర్మాలు ఉంటాయి. వేరే ఎక్కడా ఉండవు అంటుంది.

ఋగ్వేదంలో అనేక మంత్రాలలో పురాణ శబ్దం ఉపయోగించబడింది. (ఋగ్వేదం 3-5-4-9, 3-58-6, 10-130-6) కానీ ఆ సందర్భాలలో ఆ పురాణ శబ్దానికి అర్థం కేవలం 'ప్రాచీనమైన'ది అనేదే. అథర్వణ వేదంలో పురాణ శబ్దం రెండు స్థానాలలో ఉపయోగించబడింది. (ఋచః సామాని ఛందాంసి పురాణం యజుషాసహ, ఉచ్ఛిష్టజ్జజ్ఞిరే సర్వేదివి దేవా దివిశ్రితాః-11-7-24, తమితిహాసశ్చపురాణంచ -15-6-11) దీనివలన అథర్వవేద కాలానికి పురాణాలు రూపాన్ని సంతరించుకొన్నాయని నిశ్చయంగా చెప్పవచ్చు. కాబట్టి పురాణం నిగమ ఆగమాలనే మూలంగా గ్రహించినదనే విషయం స్పష్టం. ఇప్పుడు మనం సనాతన ధర్మం అని పిలుస్తున్నది వ్యవహారతయా పురాణ ప్రధానమే. ఇందులో సందేహం లేదు. వైదిక వాఙ్మయంలో సంహితలు మాత్రమే కాకుండా బ్రాహ్మణకాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు కూడా భాగాలే - వీటిలో పురాణాలను స్పష్టంగా విపులంగా పేర్కొనటం జరిగింది. శతపథ బ్రాహ్మణం అనేది యజుర్వేదంలోని ఒక భాగం. అందులో పురాణం యొక్క పుట్టుకే విశేషమైన గాథగా చెప్పబడింది. (మధ్వా హృత యోహవా ఏ ఇతా దేవానాం యదనుశాసనాని విద్యావాకో వాక్యమితిహాస పురాణం గాథా నారాశంస్య (శ.బ్రా. 11-5-6-8) ఇక్కడ 'ఇతిహాస పురాణమ్' అనేవి కలిసిపోయిన రూపంలో ఒక సమస్త పదం ద్వారా నిర్దేశింపబడింది. అయితే అథర్వణ వేదంలోని గోపథ బ్రాహ్మణంలో

(ఏవమిమే సర్వే వేదా నిర్మితాః ససంకల్పాః సరహస్యాః సబ్రాహ్మణాః సోపనిషత్కాః సేతిహాసాః సాన్వాఖ్యానాః సపురాణాః (గో. బ్రా 1-2-10) అని పురాణము ఇతిహాసములను వేరువేరుగా పేర్కొని ఆరెండింటి విభిన్నతను తెలుపుతున్నది.

ఆరణ్యకాలు, ఉపనిషత్తులు బ్రాహ్మణక సాహిత్యం యొక్క అంతిమ స్వరూపాలు. బ్రాహ్మణక గ్రంథాల పరివర్ధితరూపాలుగా ఆరణ్యకాలు, ఉపనిషత్తులు విలసిల్లుతున్నాయి. వీటిల్లో పురాణ ప్రసక్తి అనేక మార్లు కనిపిస్తుంది. తైత్తిరీయ ఆరణ్యకంలో పురాణ శబ్దం కనిపిస్తున్నది. అందులో 'పురాణాని' అనే బహువచన రూపము (బ్రహ్మ యజ్ఞ ప్రకరణేయద్ బ్రాహ్మణానీతిహాసాన్ పురాణాని కల్పాన్ గాథా నారాశంసీ ఖేదాహృతయో దేవానామ భవన్ (తై.ఆ. 2-9) అని కనిపిస్తుంది. దీనితో ముందు చెప్పబడిన 'ఆఖ్యానాల బహుత్వం తెలుస్తుంది. అలాగే బృహదారణ్య కోపనిషత్ పురాణాన్ని వేదంతో సమానంగా (అస్య మహతో భూతస్యనిశ్వసిత మేతద్ యద్ ఋగ్వేదో యజుర్వేదః సామవేదో అథర్వాఙ్గిరస ఇతిహాసః పురాణమ్' (బృ. ఉ. 2-4-10) పరిగణిస్తున్నది. అంటే ఇతిహాస పురాణాలు మహాభూతేశ్వరుడైన పరమేశ్వరుని శ్వాస రూపాలని తెలుపుతున్నది. అలాగే ఛాందోగ్యోప నిషత్తులో (అధర్వణ చతుర్థామితిహాసపురాణం పఞ్చమం వేదానాం వేదమ్ - ఛా.ఉ. 7-1-1) సనత్కుమారుని వద్ద బ్రహ్మ విద్యను నేర్చుకొనే సమయంలో నారదుడు తాను క్షుణ్ణంగా నేర్చుకొన్న విద్యలలో వేదాలతోపాటుగా ఇతిహాస పురాణాలను కూడా నేర్చుకొన్నానని స్పష్టంగా పేర్కొన్నాడు. ఇక్కడ ఉపయోగించిన పఞ్చమం అనే పదం పురాణాలను పంచమ వేదాలుగా భావించబడుతుండేదని చెప్పటానికి స్పష్టమైన ఉదాహరణ. పంచమ వేదమనే భావనలో స్థిరపడిన పురాణ విద్య వేదాలతో సమానంగా అతిప్రాచీన కాలం నుంచే భావించబడేదనే విషయం నిశ్చితం. అందువలన ఇతిహాస పురాణాలు పంచమ వేదాలుగా ప్రసిద్ధి చెందాయి.

## పురాణాలు - వేదోప బృంహణము

పురాణాలన్నీ వేదాలకు ఉపబృంహకాలే. ఉపబృంహకం అంటే ఏమిటి ? ఏ విషయం వేదంలో సూచింపబడిందో లేక సంక్షేపంగా చెప్పబడిందో ఆ విషయాన్ని విస్తారంగా నిరూపణగా వివరించటమే ఉపబృంహకత. పురాణాలు వేదాల ప్రామాణిక తలను అన్నిటికంటె ఎక్కువగా వివరిస్తున్నాయి. మహాభారతం కూడా ఇదే విషయాన్ని పురాణ రూపంలోని పూర్ణ చంద్రుడు శృతి (వేదం) అనే వెన్నెలను కాస్తాడు అని ధృవీకరిస్తున్నది. కూర్మ (1-2-19) వాయు (1-201) పద్మ (5-2-51-52) బ్రహ్మాండ (1-1-1-27) మొదలైన పురాణాలు ఇదే విషయాన్ని నొక్కి చెప్తున్నాయి. ఉపబృంహణ

పదంలోని 'బృహి' లేక 'బృహ్' అనే ధాతువుకు వర్ధనము, పెంచు అని అర్థం. అంటే వేదంలోని మంత్రాల ద్వారా ప్రతిపాదించబడిన అర్థం, సిద్ధాంతం లేక కథానకాలను విస్తరించి, వాటిని పోషించ టమే పురాణాల ద్వారా చేయబడిన వర్ధనం. దీని వలన సమస్త పురాణాలు భారతాది ఇతిహాసాలు ఏదో ఒక రూపంలో వేదార్థాన్ని ఉపబృంహణం చేస్తున్నాయి అని తెలుస్తుంది.

వేదాలను అధ్యయనం చేసేవారు వానిని సాంగోపాంగంగా అర్థాన్ని కూడా తెలుసుకోవాలని మనువు చెప్పాడు. వాయు పురాణం నాలుగు వేదాలను, వాని అంగాలైన ఆరు శాస్త్రాలను, ఉపనిషత్తులను అధ్యయనం చేసిన వ్యక్తి అయినా, పురాణాలను కూడా అతడు క్షుణ్ణంగా అధ్యయనం చేస్తేనే విచక్షణుడు కాగలడుకానీ లేకపోతే ఆ వేదాధ్యయనం విచక్షణారహితం అవుతుందని ఘోషిస్తున్నది. ఉదాహరణకు ఉపనిషత్తులలో ఒకే బ్రహ్మ చేసిన ఆకాశం యొక్క సృష్టిని గురించి కేవలం అతి సంక్షేపంగా సంకేతంగా మాత్రం (తైత్తిరీయ ఉపనిషత్తు-2-1) ఉన్నది. ఇదే విషయం అగ్ని (ఛాందోగ్యోపనిషత్తు 6-23) నీరు (ఛాందోగ్యోపనిషత్తు 6-2-4)ల సృష్టి విషయంలో కూడా ఇలాగే సూచనగా ఉండగా, పురాణాలలో దీనినే విస్తరించి ఈ తత్త్వాల ఉత్పత్తి, నాశనముల వివరణ (వాయు 4-2) (బ్రహ్మ (2-3)) బ్రహ్మాండ 2-36) కూర్మ (1-2,4,7,8) పురాణాలలో సంపూర్తిగా ఇవ్వ బడింది. ఐతరేయ బ్రాహ్మణంలోను కఠోపనిషత్తులోను చెప్పబడిన హరిశ్చంద్ర నచికేత కథలు బ్రహ్మపురాణం (104వ 105వ అధ్యాయం) భారత సభాపర్వం (అధ్యాయం 12) అనుశాసన పర్వం (అధ్యాయం 91)లలో పర్యాప్త విస్తారంగా వివరించటం జరిగింది. ఋగ్వేదంలోని ఋచవృత్తాంతం పురూరవ ఊర్వశీ వృత్తాంతాలు విష్ణు పురాణం (4-6-64)లో విపులంగా చెప్పబడ్డాయి.

పురాణాలలో వేదార్థ ఉప బృంహణం నాలుగు రకాలుగా జరిగింది.

1. వైదిక మంత్రాలలోని విశిష్ట పదాలకు అర్థాలు వివరించటం.
2. వైదిక మంత్రాలను వ్యాఖ్యానించటం
3. వైదిక ఆఖ్యానాల (కథల)ను విస్తరించటం
4. వైదిక ప్రతీకలను వ్యాఖ్యానించటం.

ఈ విధంగా పురాణాలు వేదార్థాన్ని అనేక విధాలుగా ఉపబృంహణం చేయటం జరుగుతున్నది. అందుకే గోస్వామి అనే పండితుడు పురాణ పదానికి 'పూరణాత్ పురాణమ్' అని వ్యుత్పత్తిని చెప్పటం చాలా సమంజసంగా ఉన్నది. వేదార్థాన్ని పూర్తి చేసేదే పురాణమని దీని అర్థం.

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/book/Sri+Matsya+Mahapuranam

* * *